క్లుప్తంగా

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు



ప్రభుత్వ భూమిలో బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

మునగాల : ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఆంజనేయులు హెచ్చరించారు. మండల కేంద్రం సమీపంలోని 490 సర్వే నంబర్‌లో గల ప్రభుత్వ భూమిని పలువురు రైతులు ఆక్రమించడంతో బుధవారం ఆ భూమిలో ఇది ప్రభుత్వ భూమి.. దీనిని ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పలువురు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

కోదాడ తహసీల్దార్‌గా వాజిద్‌అలీ



బాధ్యతలు చేపడుతున్న వాజిద్‌అలీ

కోదాడరూరల్ : కోదాడ తహసీల్దార్‌గా వాజిద్‌అలీ బుధవారం బాధ్యతలు చేపట్టారు. సూర్యాపేట కలెక్టరేట్‌లో పనిచేస్తున్న ఆయన బదిలీపై కోదాడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన సాయాగౌడ్ సూర్యాపేట కలెక్టరేట్‌కు బదిలీపై వెళ్లారు.

వరద బాధితులకు బియ్యం పంపిణీ



బియ్యం అందజేస్తున్న మాజీ సర్పంచ్

కోదాడరూరల్ : మండలంలోని కూచిపూడిలో ఇటీవల వర్షాలతో వచ్చిన వరదలకు నష్టపోయిన బాధితులకు ఈవీఆర్ కళాశాల బీఎస్సీ మ్యాథ్స్ మిత్రమండలి, పలువురు దాతల సహాయంతో 200 కుటుంబాలకు 25 కేజీల చొప్పున బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ శెట్టి సురేష్ మాట్లాడుతూ.. వరదతో నష్టపోయిన వారిని ఆదుకునేందుకు మరింత మంది దాతలు ముందుకు రావాలని కోరారు. శెట్టి చంద్రయ్య, వెంకటనారాయణ, రమేష్, సతీష్, వెంకట్, మట్టయ్య, నాగేంద్రబాబు, ఖరీం ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



మాట్లాడుతున్న ఎస్ఐ ముత్తయ్య

హుజూర్‌నగర్ : సైబర్ నేరాల పట్ల బాలికలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ముత్తయ్య అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని మైనార్టీ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, బాల్య వివాహాలపై అవగాహన కల్పించి మాట్లాడారు. సెల్‌ఫోన్ వాడకం, ఓటీపీ, అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. బాల్య వివాహాలు నేరమని అన్నారు. అనుమానిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు తెలపాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రెహనా బేగం, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి అంబేద్కర్ యూత్ చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న అంబేద్కర్ యూత్ సభ్యులు

మోతె : మండలంలోని రావిపహాడ్ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన గజ్జి కనకయ్య ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. దీంతో బుధవారం కనకయ్య కుటుంబానికి బీఆర్ అంబేద్కర్ యూత్ సభ్యులు రూ.33 వేలు ఆర్థిక సాయం అందజేసి అండగా నిలిచారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ గ్రామంలో ఎవరికి ఎలాంటి ఆపద వచ్చిన యూత్ తరఫున అండగా నిలుస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

నేడు కేంద్ర బృందం పర్యటన

నడిగూడెం : నడిగూడెం మండలం కాగిత రామచంద్రాపురంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన పంటలను పరిశీలించడానికి కేంద్ర ప్రత్యేక బృందం గురువారం పర్యటించనున్నట్లు మండల వ్యవసాయాధికారి దేవ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంట నష్టాన్ని పరిశీలించి, రైతులతో మాట్లాడనున్నట్లు పేర్కొన్నారు.

నేడు శాంతి కమిటీ సమావేశం

మునగాల : గణేష్ ఉత్సవాల విజయవంతానికి మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు ఎస్ఐ బి.ప్రవీణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఉత్సవ కమిటీల సభ్యులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అప్రోచ్ రోడ్డు నిర్మాణంలో జాప్యం

- తాడువాయి శివారులో గురప్పవాగు అలుగు వద్ద పూర్తయిన బ్రిడ్జి నిర్మాణం
- అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి పూర్తికాని టెండర్ల ప్రక్రియ
- ఇటీవల వరదలకు కొట్టుకుపోయిన మట్టి రోడ్డు
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు





తాడువాయి శివారులో గురప్పవాగుపై నిర్మించిన బ్రిడ్జి, మట్టి పోసి రాకపోకలు సాగిస్తున్న గ్రామస్తులు

మునగాల : మండలంలోని తాడువాయి శివారులో గురప్ప వాగు అలుగు వద్ద రూ.2.60 కోట్ల వ్యయంతో చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయ్యాయి. కానీ బ్రిడ్జికి ఇరువైపులా అప్రోచ్ రోడ్డు నిర్మించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఏడాది క్రిందట ప్రారంభమైన బ్రిడ్జి నిర్మాణ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. కానీ బ్రిడ్జికి రెండు వైపులా అప్రోచ్ రోడ్డు నిర్మించడంలోనే జాప్యం జరుగుతోంది. దీంతో గతంలో ఉన్న మట్టి రోడ్డు మీదుగా తాడువాయి గ్రామ ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. కాగా, బ్రిడ్జి నిర్మాణం వరకే తమ పని అని రెండు వైపుల అప్రోచ్ రోడ్డుతో తనకు సంబంధం లేదని కాంట్రాక్టర్ అంటున్నారు.

అప్రోచ్ రోడ్డుకు రూ.1.50 కోట్లు..

బ్రిడ్జికి ఇరువైపులా అప్రోచ్ రోడ్డు, గోడలు నిర్మించేందుకు ప్రభుత్వం ఇటీవల రూ.1.50 కోట్లు మంజూరు చేసింది. కానీ అప్రోచ్ రోడ్డుకు టెండర్ ప్రక్రియ పూర్తి కాలేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గురప్పవాగు ఎగువన ఉన్న మాధవరం, మొద్దుల చెరువులు అలుగులు పోస్తుండడంతో వరద నీరు గురప్పవాగుకు చేరి గురప్పవాగు అలుగు పోస్తుండడంతో అలుగు ముందు ఉన్న మట్టి రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో పది రోజుల పాటు తాడువాయి -మునగాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో గ్రామస్తులు నూతన బ్రిడ్జికి ఇరువైపులా మట్టి తోలించి తాత్కాలికంగా రాకపోకలకు సాగిస్తున్నారు. ప్రస్తుతం గ్రామానికి మునగాల నుంచి స్కూల్ బస్సులు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు వెళ్లే వీలు మాత్రం లేదు. కేవలం కాలినడకన మాత్రమే వెళ్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి యుద్ధప్రాతిపదికన టెండర్లు వేసి అప్రోచ్ రోడ్డు పనులు పూర్తిచేసి బ్రిడ్జిని వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

యుద్ధప్రాతిపదికన అప్రోచ్ రోడ్డు వేయాలి



తాడువాయి శివారులో నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జికి ఇరువైపులా యుద్ధప్రాతిపదికన అప్రోచ్ రోడ్డు వేయాలి. స్థానిక ఎస్ఐ ప్రోద్బలంతో పది రోజుల క్రితం గ్రామస్తులు బ్రిడ్జికి ఇరువైపులా మట్టి పోశారు. దీంతో స్కూలు పిల్లలు, రైతులు, వ్యవసాయ కూలీలు తమ పనుల నిమిత్తం కాలినడకన బ్రిడ్జి పైనుంచి ప్రయాణం సాగిస్తున్నారు.

– కోల ఆంజనేయులు, బీసీ సంఘం నాయకుడు, తాడువాయి

స్థానిక ఎమ్మెల్యే స్పందించాలి



తాడువాయి శివారులో రూ.2.60 కోట్లతో నిర్మించిన బ్రిడ్జికి ఇరువైపులా అప్రోచ్ రోడ్డు ఏర్పాటుకు స్థానిక ఎమ్మెల్యే పద్మావతి ప్రత్యేక శ్రద్ధ వహించాలి. అప్రోచ్ రోడ్డు లేక రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ప్రస్తుతం ఉన్న సర్వీస్ రోడ్డు వరదలకు కొట్టుకుపోయింది. ఈ రహదారి గుండా మూడు గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు.

– కోట మన్మథుడు, బీఎస్పీ మండల అధ్యక్షుడు, తాడువాయి

మూసీ నది వద్ద నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



చిల్లెపల్లి పరిధిలోని మూసీ నది వద్ద నిమజ్జన ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

నేరేడుచర్ల : మండలంలోని చిల్లేపల్లి పరిధిలోని మూసీ నది వద్ద గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను బుధవారం రాత్రి కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేరేడుచర్ల, గరిడేపల్లి మండలాలకు చెందిన గణపతి విగ్రహాలు చిల్లేపల్లి వద్ద మూసీ నదిలో నిమజ్జనానికి వచ్చే అవకాశం ఉందని, అక్కడ క్రేన్, జేసీబీలు సిద్ధంగా ఉంచాలని పోలీసులను ఆదేశించారు. లారీల్లో తీసుకొచ్చే విగ్రహాలను మాహంకాళిగూడెం, వాడపల్లిలోని కృష్ణానది వద్దకు పంపించాలని ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలన్నారు. నిమజ్జనానికి కేవలం పారిశుద్ధ్య కార్మికులు, పోలీస్ సిబ్బంది సహాయం తీసుకోవాలన్నారు. భక్తులు నదిలోకి దిగకుండా చూడాలని చెప్పారు. ఆయన వెంట సీఐ చరమందరాజు, ఎస్ఐ రవీందర్ ఉన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు ప్రారంభం



బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చల్లా శ్రీలతారెడ్డి

నేరేడుచర్ల : బీజేపీ సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు పార్టీ కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పని చేయాలని పార్టీ హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చల్లా శ్రీలతారెడ్డి అన్నారు. బుధవారం నేరేడుచర్లలోని బీజేపీ కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. రాబోయే కాలంలో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు సంకలమద్ది సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ కిసాన్ మోర్చా పట్టణ అధ్యక్షుడు తాళ్ల నరేందర్‌రెడ్డి, నాయకులు ఉరుమిళ్ల రామ్మూర్తి, శంకర్‌రెడ్డి, వెంకన్న, నాగయ్య, దేవిరెడ్డి నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీ ఎన్నిక



పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం

గరిడేపల్లి : మండల కేంద్రంలోని జీవము గల దేవుని సంఘం చర్చిలో పాస్టర్స్ ఫెలోషిప్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం మాజీ అధ్యక్షుడు పాస్టర్ దేవదానం అధ్యక్షతన జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జి.డేవిడ్‌రాజు, గౌరవ సలహాదారుడు పాస్టర్ సామ్యూల్, కన్వీనర్ పాల్ రాజు, నియోజకవర్గ ప్రెసిడెంట్ పాస్టర్ టి.సుధాకర్ సమక్షంలో కమిటీని ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షుడిగా పాస్టర్ జాకబ్ రాజు, ప్రెసిడెంట్‌గా ఎ.పాలు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కరుణాకర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా పాస్టర్ కోటేశ్వరరావు, సెక్రటరీగా పాస్టర్ ప్రభుకిరణ్, జాయింట్ సెక్రటరీగా చిట్టిబాబు, ట్రెజరర్‌గా పాస్టర్ లక్ష్మణ్‌నాయక్, గౌరవ సలహాదారులుగా పాస్టర్ ఇమ్మానుయేలు, పాస్టర్ జకర్య, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా ఎం.జేమ్స్ ఆనంద్‌ను ఎన్నుకున్నారు.

జీవాల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలి

కోదాడరూరల్ : వర్షాకాలంలో మేకలు, గొర్రెలకు సోకే వ్యాధుల పట్ల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని కోదాడ ప్రాంతీయ పశువైద్యశాల డాక్టర్ పి.పెంటయ్య సూచించారు. హిమాంకాస్ కాంటర్టస్ ప్రాణంతకమైన వ్యాధి సోకి మృతి చెందిన మేకకు బుధవారం స్థానిక పశువైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి మాట్లాడారు. నడిగూడెం మండలం కాగిత రామచంద్రాపురంలో మేకల కాపరి వేముల వీరబాబుకు చెందిన మేకలు మృతి చెందుతుండటంతో ఆయన వాటికి పోస్టుమార్టం నిర్వహించి వ్యాధిని గుర్తించినట్లు తెలిపారు. వర్షాకాలంలో చిత్తడి నేలల్లో గడ్డిని వెతుక్కొని మేసే క్రమంలో నోటి ద్వారా అంతరపరాన్న జీవులు లోపలికి వెళ్లి ఇవి మరింత పెరిగి జీవాలు మృతి చెందేందుకు కారణమవుతాయని తెలిపారు. ముందస్తు నివారణ చర్యలు తీసుకొని వ్యాధి నుంచి మందను కాపాడుకొవచ్చని పేర్కొన్నారు.

వరద బాధితులకు బెడ్‌షీట్లు, టవల్స్ అందజేత



కోదాడ క్యాంపు కార్యాలయంలో బెడ్‌షీట్లు అందజేస్తున్న దాతలు

మోతె : ఇటీవల కురిసిన వానలకు నియోజకవర్గంలో వచ్చిన వరదలకు సర్వం కోల్పోయిన బాధితులకు కోదాడ ఎమ్మెల్యే పద్మావతి పిలుపు మేరకు మోతె మండలంలోని సర్వారం గ్రామానికి చెందిన మిక్కిలినేని కృష్ణ కిరీటి బుధవారం 300 బెడ్‌షీట్లు, టవల్స్, పిల్లో కవర్లు కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇన్‌చార్జ్ మల్లేశ్వర్‌కి అందజేశారు. కార్యక్రమంలో సర్వారం మాజీ సర్పంచ్‌లు మిక్కిలినేని పురుషోత్తరావు, మేకల గురుకృష్ణ, నోముల వెంకన్న, తదితరులు ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

నడిగూడెం : వసతి గృహం పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీఓ ఎస్‌డీ.ఇమామ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బీసీ బాలికల వసతి గృహం, కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పారిశుద్ధ్య చర్యల్లో భాగంగా చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌ను ఆయన పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులకు సీజనల్ వ్యాధులు సోకకుండా దోమల నివారణకు మందు పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్, స్థానిక పల్లె దవాఖానా వైద్యాధికారి డాక్టర్.హరినాథ్, హెల్త్ అసిస్టెంట్ కృష్ణమూర్తి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విష జ్వరాలను నివారించాలి

మఠంపల్లి : మండలంలో కురిసిన భారీ వర్షాలకు పారిశుద్ధ్యం లోపించి విజృంభిస్తున్న అంటు వ్యాధులు, విషజ్వరాల నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను కోరారు. బుధవారం మఠంపల్లిలో నిర్వహించిన సీఐటీయూ మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో సిమెంట్ పరిశ్రమల నుంచి విడుదలయ్యే డస్ట్‌తో ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని అన్నారు. మండలంలోని ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు సిబ్బందిని, మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ మండల కన్వీనర్ సయ్యద్‌రన్‌మియా, నాయకులు సైదా, అంజయ్య, శాంతికుమారి, లింగమ్మ, లాలాసాబ్, వెంకటేశ్వర్లు, దేవదానం, మహ్మద్, మైసయ్య, గురువారెడ్డి, నాగలక్ష్మి, మంగమ్మ, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసోత్సవాలు



గరిడేపల్లి : పోషణ మహోత్సవంలో పాల్గొన్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్, టీచర్, తదితరులు



చిలుకూరు : అంగన్‌వాడీ కేంద్రంలో ప్రతిజ్ఞ చేస్తున్న సూపర్‌వైజర్, టీచర్లు, గర్భిణులు, బాలింతలు

నేరేడుచర్ల : అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేసే పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు యశోధ, రాజ్యలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని కల్లూరులో, నేరేడుచర్ల మున్సిపాలిటీలోని రామాపురంలో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన పోషణ మాసోత్సవంలో ఆమె మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శి సైదులు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అనంతరెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు భూదేవి, ఆర్.ప్రీతి, పి.అన్నమ్మ, ఆయా వెంకటమ్మ, బాలింతలు, గర్భిణులు ఉన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

హుజూర్‌నగర్ : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సోమమ్మ అన్నారు. జాతీయ పోషణ మాసోత్సవంలో భాగంగా బుధవారం హుజూర్‌నగర్‌లోని గోవిందపురం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ వై.రాజేష్, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు, పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం

చిలుకూరు : పోషకాహారంతో ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునిత అన్నారు. బుధవారం చిలుకూరులోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు, బాలింతలకు పోషకాహారంపై ఆమె అవగాహన కల్పించి మాట్లాడారు. అనంతరం పోషణ మాసం సందర్భంగా వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సిరికొండ కవిత, కస్తూరి జయలక్ష్మి, సరస్వతి, లక్ష్మి, జ్యోతి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

కీతవారిగూడెంలో..

గరిడేపల్లి : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా తమ పిల్లలను సంపూర్ణ ఆరోగ్యంతో ఉంచుకోవచ్చని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రేవతి అన్నారు. మండలంలోని కీతవారిగూడెం సెక్టార్ పరిధిలోని సర్వారం అంగన్‌వాడీ కేంద్రం -2లో బుధవారం పోషణ మాసోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ వంశీప్రియ, ఉష, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కోదాడరూరల్ : కోదాడ మండలంలో వచ్చిన భారీ వర్షానికి వచ్చిన వరదలతో నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి, పార్టీ నాయకుడు భాషబోయిన భాస్కర్‌రావులు అన్నారు. బుధవారం మండలంలోని గుడిబండలో పార్టీ మండల ముఖ్య నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలో వరదతో పదకొండు వందల కుటుంబాలకు నష్టం వాటిల్లిందని తెలిపారు. 1500 వందల ఎకరాల్లో పంట దెబ్బతిన్నదని తెలిపారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిలు ముంపు గ్రామాల్లో పర్యటించి వారిని ఆదుకునేందుకు తక్షణమే పనులు ప్రారంభించాలని ఆయా శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్.. మంత్రి ఉత్తమ్ దంపతులపై అర్థరహితమైన ఆరోపణలు చేస్తున్నారని వాటిని మానుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని అన్నారు. అంతకు ముందు మాజీ జెడ్పీటీసీ మండలపు కృష్ణకుమారి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఇర్ల సీతారాంరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రేవూరి వెంకటాచారి, భాషబోయిన భాస్కర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్లు నంబూరి సూర్యం, ఓ.శ్రీనివాసరెడ్డి, అమరనాయిని వెంకటేశ్వరరావు, బెంజిమెన్, శరభేశ్వరరావు, రఫి, నర్సింహారెడ్డి, నరోత్తమరెడ్డి, రాజారావు ఉన్నారు.

బదిలీపై వెళ్లిన ఉద్యోగులకు సన్మానం



బదిలీపై వెళ్లిన ఉద్యోగులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్

నడిగూడెం : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన పలువురు ఉద్యోగులకు బుధవారం ఆ కళాశాలలో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రిన్సిపాల్ విజయనాయక్ మాట్లాడుతూ ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తే ఎల్లప్పుడూ గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సన్మాన గ్రహీతలు, అధ్యాపకుడు ఆర్.పిచ్చిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శాంతయ్య, ఉప్పయ్య, అన్వేష్, రజియా, తదితరులు ఉన్నారు.

ఉద్యమం.. కమ్యూనిస్టుల వారసత్వ సంపద



హుజూర్‌నగర్ : ప్రచార జాతాలో పాల్గొన్న సీపీఐ రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు

హుజూర్‌నగర్ : ఉద్యమం, పోరాటం కమ్యూనిస్టుల వారసత్వ సంపద అని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. బుధవారం తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాల్లో భాగంగా చింతలపాలెంలోని అమరవీరుల స్థూపం వద్ద నుంచి ప్రారంభమైన సీపీఐ జాతా రాత్రి హుజూర్‌నగర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు అధ్యక్షతన అమరవీరుల స్థూపం వద్ద సాయుధ పోరాట వీరులు డి.శెంబిరెడ్డి, డి.లింగన్న, గోపయ్య, రాములుకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రాష్ట్ర, జిల్లా కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, కంబాల శ్రీనివాస్, దేవరం మల్లేశ్వరి, ఉస్తెల నారాయణరెడ్డి, బద్దం కృష్ణారెడ్డి, పోకల వెంకటేశ్వర్లు, ధూళిపాల ధనుంజయనాయుడు, దొంతగాని సత్యనారాయణ, జడ శ్రీనివాస్, యల్లావుల రమేష్, అమరవరం పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టులే నిజమైన దేశభక్తులు

నేరేడుచర్ల : కమ్యూనిస్టులే నిజమైన దేశభక్తులని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో జరుగుతున్న తెలంగాణ సాయుధ పోరాట 76వ వార్షికోత్సవ ప్రచార జాత బుధవారం నేరేడుచర్లకు చేరుకున్న సందర్భంగా సీపీఐ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ధనుంజయనాయుడు, కంబాల శ్రీనివాస్, బద్దం కృష్ణారెడ్డి, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోటమ్మ, దేవరం మల్లీశ్వరి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు చిలకరాజు శ్రీను, మల్లయ్య, సింహాద్రి, కత్తి శ్రీనివాస్‌రెడ్డి, రావుల సత్యం, వెంకన్నకుమార్ తదితరులు ఉన్నారు.

కమ్యూనిస్టుల పోరాటంతో తెలంగాణకు విముక్తి

గరిడేపల్లి : రజాకార్లకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు వీరోచితంగా పోరాడడంతోనే తెలంగాణకు విముక్తి లభించిందని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన అన్నారు. బుధవారం తెలంగాణ సాయుధ పోరాట 76వ వార్షికోత్సవాలను పురస్కరించుకొని మండలంలోని పొనుగోడు గ్రామంలో మాజీ సర్పంచ్, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు హనుమాల లింగయ్య స్థూపం వద్ద, గానుగుబండ, రంగాపురం గ్రామాల్లో అమరవీరుల స్థూపాల వద్ద అరుణ పతాకాలను ఎగురవేసి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, బద్దం కృష్ణారెడ్డి, దేవరం మల్లీశ్వరి, కోటమ్మ, కడియాల అప్పయ్య, యడ్ల అంజిరెడ్డి, బిల్ల కనకయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు



హుజూర్‌నగర్ : వినాయకుని మండపం వద్ద కుంకుమ అర్చనలో పాల్గొన్న మహిళలు



నేరేడుచర్లలో గణనాథుడి శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



మఠంపల్లి : క్రిష్ణానది వంతెనపై ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్

మఠంపల్లి : మండలంలోని మట్టపల్లి వద్ద క్రిష్ణానదిలో వినాయకుని విగ్రహాల నిమజ్జనాలు కొనసాగుతున్నాయి. బుధవారం క్రిష్ణానది వద్ద నిమజ్జన ఏర్పాట్లను ఆర్డీఓ శ్రీనివాసులు, తాహసీల్దార్ మంగారాథోడ్, సీఐ చరమందరాజు, ఎంపీడీఓ హరిసింగ్, ఎస్ఐ రామాంజనేయులు, కార్యదర్శి చంద్రశేఖర్ పరిశీలించారు.

వైభవంగా గణనాథుడి శోభాయాత్ర

నేరేడుచర్ల : పట్టణంలోని పద్మావతినగర్‌లో గల శ్రీసాయి అపార్ట్‌మెంటులో ఏర్పాటు చేసిన గణనాథుడి శోభాయాత్రను బుధవారం వైభవంగా నిర్వహించారు. అనంతరం మూసీ నదిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొణతం సత్యనారాయణరెడ్డి, అపార్ట్‌మెంటు సభ్యులు రాగిరెడ్డి గోపాల్‌రెడ్డి, కుంకు చిన్నయ్య, తాటికొండ శ్రీరాంరెడ్డి, సత్యనారాయణరెడ్డి, వెంకటేశ్వర్లు, మాదవరెడ్డి, సైదిరెడ్డి, వెవెంకట్‌రెడ్డి, మోహన్‌రావు, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

నడిగూడెం : మండలంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం గణనాథుని విగ్రహాల వద్ద భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు.

మండపం వద్ద కుంకుమ అర్చనలు

హుజూర్‌నగర్ : వినాయక చవితి నవరాత్రోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలో పలు చోట్ల గణేశ్‌లకు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కుంకుమ అర్చనలు నిర్వహించారు. అన్నమయ్య భజన మండలి సభ్యులు ఆలపించిన భక్తిగీతాలు పలువురిని ఆకట్టుకున్నాయి. పలు చోట్ల అన్నదానం నిర్వహించారు. ఐదవ రోజు కావడంతో పలువురు గణనాథుల శోభాయాత్ర నిర్వహించి నిమజ్జనానికి మట్టపల్లికి తరలించారు.

ఉర్లుగొండలో అన్నదానం

మోతె : మండలంలోని ఉర్లుగొండలో గణేశ్ మండపం వద్ద బుధవారం దాతలు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి ప్రారంభించాడు. ఈ సందర్భంగా వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మామిడి వెంకటేశ్వర్లు, పులి ఈదయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.



మోతె : ఉర్లుగొండలో అన్నదానం ప్రారంభిస్తున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి



నడిగూడెంలో వినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు